క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

దుద్యాల్: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొడంగల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అహ్మద్ పాషా అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కురుస్తున్న వానలతో రైతులు ఆరబెడుతున్న ధాన్యం తడిసిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆరుగాలం పండించిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని సేకరించాలని కోరారు.

శివాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న హన్మంతు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోట్ల హన్మంతు తిమ్మారెడ్డిపల్లి శివాలయానికి రూ.21 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికభావాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సన్మానించారు.

పథకాల అమలులో పక్షపాతం వద్దు



పంచాయతీ సెక్రటరీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ గ్యామా నాయక్

దోమ: సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిస్పక్షపాతంగా వ్యవహరించాలని ఎంపీడీఓ గ్యామానాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ వారి ఉన్నతికి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు లేకపోతే వాహనాలు సీజ్

బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్



నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలతో పోలీసులు

బషీరాబాద్: నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో నంబర్ ప్లేట్లు లేని పది ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. వెంటనే వీటికి కొత్త ప్లేట్లు బిగించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

విత్తనాల రశీదులు తప్పనిసరి

అనంతగిరి: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న వ్యాపారులు, డీలర్లను మాత్రమే సంప్రదించాలని సూచించారు. పంట పూర్తయ్యే వరకు బిల్లులను జాగ్రత్తగా దాచుకోవాలని తెలిపారు. ఎవరైనా పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు తీసుకువచ్చి విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.901 మాత్రమే ఉందని, ఎక్కువ తీసుకుంటే నంబర్ 8977756073లో సంప్రదించాలని సూచించారు.

పాడిపశువులతో ఆర్థికాభివృద్ధి

పశువైద్యాధికారి దేవిరెడ్డి



పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు పశువులను జాగ్రత్తగా పోషించుకున్నప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాకారంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గేదెలకు, ఆవులకు టీకా వేసి మాట్లాడుతూ పాడి రైతులు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్ రవి, రైతులు, పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

జొన్న పండింది

ఆశాజనంగా తెల్లజొన్న, మొక్కజొన్న దిగుబడులు

- పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో మద్దతు ధరకు కొనుగోళ్లు
- దళారులను ఆశ్రయించే బాధ తప్పిందని రైతుల హర్షం

మోమిన్‌పేట: రబీలో తెల్లజొన్న సాగు చేసిన రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారు. సాగు నీటి వసతి ఉన్నవారు తెల్లజొన్న, మొక్కజొన్న అధికంగా సాగుచేశారు. అడవి పందుల బెడదను తట్టుకునేందుకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. పెట్టుబడి, కూలీల ఖర్చు తక్కువ కావడం, స్థిరమైన ఆదాయం ఉంటుందనే నమ్మకంతో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో వానాకాలం సీజన్‌లో మాత్రమే వీటిని పండించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జొన్న రొట్టె తినేవారి సంఖ్య పెరిగింది. దీంతో తెల్లజొన్నలకు మార్కెట్లో మంచి డిమాండ్ లభిస్తోంది. ప్రస్తుతం పంట చేతికొస్తోంది. జొన్నలకు క్వింటాలుకు రూ.3 వేలకు పైగా, మొక్కజొన్నలకు రూ.2,350 వరకు పలుకుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో గరిష్ఠంగా 35 క్వింటాళ్ల మొక్కజొన్నలు వస్తున్నాయి.



మోమిన్‌పేటలోని అంరాధికలాన్‌లో కోతకు వచ్చిన తెల్లజొన్న

నేరుగా డబ్బులు

మండల పరిధిలోని చీమల్‌దరి, చక్రంపల్లి, మోమిన్‌పేట, ఎన్కతల, ఎన్కేపల్లి, దుర్గంచెర్వు, వెల్‌చాల్, టేకులపల్లి, అంరాధికుర్దు, అంరాధికలాన్ తదితర గ్రామాలలో రబీలో తెల్లజొన్న, మొక్కజొన్న పంటను విరివిగా సాగు చేశారు. తెల్లజొన్నలకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 ఉంది. మోమిన్‌పేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో వీటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో దళారులను ఆశ్రయించే బాధ తప్పిందని కర్షకులు పేర్కొంటున్నారు. రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్థిరమైన ఆదాయం



కూరగాయల సాగుకు పెట్టుబడి ఎక్కువగా అవుతోంది. సరైన ధరలు లేకపోతే ఒక్కోసారి ఖర్చులు కూడా రావడం లేదు. జొన్న, మొక్కజొన్న తక్కువ పెట్టుబడితో పూర్తవుతుంది. స్థిరమైన ఆదాయం ఉంటుంటి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మద్దతు ధర రావడంతో ఇబ్బందులు తప్పుతున్నాయి.

– రాంచంద్రారెడ్డి, ఎన్కేపల్లి

రిస్క్ లేని పంట



తెల్లజొన్న, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటల సాగుకు రిస్క్ తక్కువే. ప్రభుత్వం నుంచి మద్దతు ధర అందుతుండటంతో నష్టాలకు అవకాశం ఉండదు. నాణ్యమైన విత్తనాలను ఎంచుకుని, అడవి పందుల బారి నుంచి రక్షించుకుంటే సరిపోతుంది. ఈసారి మంచి దిగుబడులు వచ్చాయి.

– జయశంకర్, వ్యవసాయాధికారి, మోమిన్‌పేట

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కేరవెళ్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేరవెళ్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, డీసీసీ ఉపాధ్యక్షులు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, దేవనోనిగుడ వెంకటయ్య, రహీస్‌ఖాన్, నాయకులు నర్సింహారెడ్డి, జమీల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ చొరవతో బోరు తవ్వకం



తరిగోపుల ఎస్సీ కాలనీలో బోరు డ్రిల్లింగ్ పనులు

ధారూరు: శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిలబెట్టుకున్నారు. తరిగోపులలోని ఎస్సీ కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం శుక్రవారం బోరుబావిని తవ్వించారు. జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, కాంగ్రెస్ స్థానిక నాయకులు గఫార్, వన్నెయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. త్వరలోనే మోటారు బిగించి, నీటి సమస్యను తీరుస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు టౌన్: కరన్‌కోట్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగింపు పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కరెంటు ఉండదని డీఈ భానుప్రసాద్ శుక్రవారం ఓ ప్రకనటలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన నర్సరీ షెడ్

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నర్సరీ షెడ్డు ఈదురు గాలులు, భారీ వర్షానికి నేలకొరిగింది. దీంతో నర్సరీలోని మొక్కలు పాడయ్యాయి. సంబంధిత అధికారిని వివరణ కోరగా ఈ నర్సరీని ఇక్కడ నుంచి ఎన్నేపల్లికి తరలిస్తున్నామని చెప్పారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వీధి కుక్కల నియంత్రణకు నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీధి కుక్కల సమస్యలు పెరుగుతున్నందున జంతువుల స్వేచ్ఛకు భంగం కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు చేపడుతున్నామన్నారు.

పార్కులో ఆట వస్తువుల ఏర్పాటుకు శంకుస్థాపన పట్టణ పరిధి ఆర్‌టీసీ కాలనీలో పార్కులో పిల్లలకు ఆడుకునేందుకు ఆట వస్తువుల ఏర్పాటు కోసం చేపట్టే పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.8లక్షల మున్సిపల్ నిధులతో పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సునీత, నాయకులు చెన్నయ్య, తిరుపతిరెడ్డి, జమృత్‌ఖాన్, శాంతమ్మ, సుధీర్, బస్వం, ఇబ్రహీం, కృష్ణారెడ్డి, శ్రీశైలంగౌడ్, గంగిరెడ్డి, విష్ణుమూర్తి, జయప్రకాశ్, వర్షగౌడ్, సాయికృష్ణ, శేఖర్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

షాద్‌నగర్‌రూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇల్లులేని నిరుపేదలకు పక్కా ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులందరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకోవాలని అన్నారు. ఇంటి నిర్మాణం డబ్బులకోసం ఏ అధికారి చుట్టూ తిరగాల్సిన అవసరంలేదని, అధికారులే మీ వద్దకు వచ్చి బిల్లులు చేస్తారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం డబ్బులు నేరుగా లబ్దిదారుల ఖాతాలోకే వస్తాయని, ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతిఒక్కరూ ఇంటిని నిర్మించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌లీఖాన్‌బాబర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లాశ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డీసీ నాయక్, ఎంపీడీఓ బన్సీలాల్, నాయకులు శివశంకర్‌గౌడ్, ఎండి.ఇబ్రహీం, ముబారక్‌అలీ, రాములుగౌడ్, రాజునాయక్, శ్రీనునాయక్, బాలునాయక్, సురేష్‌గౌడ్, జాంగారి రవి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వీరనాగమ్మ కల్యాణం



అమ్మవారి ఊరేగింపు

కేశంపేట: మండల కేంద్రంలోని వీరనాగమ్మ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సావాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఊరేగింపు, గంగపూజ అనంతరం అమ్మవారి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో శివాజీ, సత్యనారాయణ, నరేష్, జగన్, పాండు, రమేష్, మహేష్, నరేష్, శ్రీనివాస్, రాంచందర్, లక్ష్మణ్, మహేందర్, కిట్టు మల్లిఖార్జున్, పవన్, బాలోజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

షాద్‌నగర్: ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని.. ఇలాంటి వాటిని మానుకోవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో రైతులు తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నియోజకవర్గం వ్యాప్తంగా 24,360 ధాన్యం బస్తాలను కొనుగోలు చేసిందని తెలిపారు. వర్షాలు కురిసే సరికే రైతులు తీసుకొచ్చి ధాన్యాన్ని కమీషన్ ఏజెంట్లు నిబంధనల ప్రకారం టెండర్లు వేసి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటుగా బోనస్‌కు కూడా చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని అన్నారు. బీజేపీ నేతలు స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, సురేష్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్
- పులిచర్లకుంటతండాలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

దుద్యాల్: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ అన్నారు. పులిచర్లకుంట తండాకు రూ.84 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పల్లెలు, గూడేలు, గిరిజనతండాలు, మారుమూల ప్రాంతాల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. దుద్యాల్ మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, పారిశ్రామిక వాడ ఏర్పాటు వంటి అనేక రకాల పనులు కొనసాగుతున్నయన్నారు. దుద్యాలలో మండల సమీకృత భవనాల నిర్మాణం, రూ.200 కోట్ల నిధులతో ప్రతీ గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణం సాగుతోందని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, సీనియర్ నాయకులు సీతారాం నాయక్, నాయకులు యుగందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- ఎంఈఓ వెంకట్
- బొంపల్లిలో 'బడిబాట'



బొంపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఎంఈఓ వెంకట్, ఉపాధ్యాయులు తదితరులు

దోమ: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ వెంకట్ అన్నారు. మండల పరిధిలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతవరణం, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాల్లోనే అందుబాటులో ఉంటారన్నారు. దీనికి తోడు ప్రభుత్వం నుంచి ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ మాయలో పడి తల్లిదండ్రులు మోసపోవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు



మేడిపల్లికలాన్‌లో క్రికెట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

- మాజీ ఎంపీపీ మల్లేశం
- మేడిపల్లికలాన్‌లో క్రికెట్ టోర్నీ ప్రారంభం

పూడూరు: క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు స్నేహసంబంధాలు మెరుగవుతాయని మాజీ ఎంపీపీ మల్లేశం అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లికలాన్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనతరం మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పోటీలు జరుపుకోవాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు రహీస్‌ఖాన్, యువజన విభాగం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు రవి, నర్సింలు, తుప్పరి నర్సింలు, రమేష్, బొర్ర బోపాల్ తదితరులు పాల్గొన్నారు.



డీకేంతండా గిరిజనం పథకాలు సాధించిన విద్యార్థులను సన్మానించిన దృశ్యం

ప్రతిభావంతులకు సన్మానం

ధారూరు: అంతర్జాతీయ డ్రాగన్ చాంపియన్‌షిప్, రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన డీకేతండా విద్యార్థులు స్రవంతిబాయి, దీపికను ఘనంగా సన్మానించారు. శుక్రవారం తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు వీరిని అభినందించారు. మాణిక్‌రావు, సంతోషికుమారి కూతురు స్రవంతి బాయి సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల (వాటర్ స్పోర్ట్స్ అకాడమి)లో చదువుతోంది. ఇటీవల ఫిలిప్పీన్స్‌లో నిర్వహించిన డ్రాగన్ బోట్ పోటీల్లో పాల్గొన్న బాలిక మూడు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించింది. ఇదే తండాకు చెందిన దీపిక మహబూబాబాద్‌లో నిర్వహించిన ఫెన్సింగ్(ఖడ్గం) పోటీల్లో బంగారు పతకం సాధించింది. వీరిని తండావాసులతో పాటు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు దేవుజ్యానాయక్, వివిధ పార్టీల నాయకులు బాల్‌రాజ్‌నాయక్, రాజునాయక్, రాములునాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- దోమలతోనే రోగాల వ్యాప్తి
- వైద్యాధికారులు, సిబ్బంది
- డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ, మున్సిపల్ అధికారులు

పరిగి: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దరిచేరవని తెలిపారు. ఆవాసాల మధ్య మురుగు, చెత్తాచెదారం నిల్వ ఉంటే దోమలు వ్యాపిస్తాయన్నారు. వీటిద్వారా అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి వెంకన్న, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి విద్యాప్రియ తదితరులు పాల్గొన్నారు.

దోమలతోనే రోగాలు

కుల్కచర్ల: పరిసరాల పరిశుభ్రతతో అనారోగ్య పరిస్థితులను దూరం చేయొచ్చని మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్ అన్నారు. డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కుల్కచర్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రోగాల బారిన పడటానికి ప్రధాన కారణం దోమలేనని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే ఇవి ఎక్కువగా వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, మెడికల్ అసిస్టెంట్ వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమలు వృద్ధి చెందొద్దు..

దౌల్తాబాద్: డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్య తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా దోమలో ర్యాలీ నిర్వహించారు. దోమ కాటుతోనే డెంగీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అమూల్య, సూపర్‌వైజర్ రఫీ, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హేమంత్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ హర్ష, ఏఎన్‌ఎంలు పుష్పలత, శ్రీలత, కవిత, షాహిదబేగం, తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో డెంగీ అవగాహన ర్యాలీ



కుల్కచర్లలో ర్యాలీ తీస్తున్న అధికారులు